అమ్మవారికి 108 రకాల నైవేద్యం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోవిందరావుపేటలోని తారకరామా కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మంగళవారం ఉత్సవ సమితి సభ్యులు, మహిళలు 108 రకాల ప్రసాదాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు చేయడంతో పాటు హోమ క్రతువు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు, పండ్లను భక్తజనులకు వితరణ చేశారు.

– న్యూస్‌టుడే, గోవిందరావుపేట

30 ఏళ్లు పైబడిన వారికి వైద్య పరీక్షలు తప్పనిసరి

ములుగు, న్యూస్‌టుడే: 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పోటు, మధుమేహం, కాన్సర్ పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య అన్నారు. ములుగులోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రోగ నిర్ధారణ జరిగిన వారికి మందులు అందజేయాలని, మందులను క్రమపద్ధతిలో వాడేలా ప్రోత్సహించాలన్నారు. క్యాన్సర్ అనుమానితులను నిర్ధారణ కోసం రిఫరల్ సెంటర్స్‌కి పంపించాలని, అలా చేయడం వల్ల జరగబోయే నష్టాన్ని కొంత వరకు తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి సత్యేంద్రనాద్, జిల్లా ఉప వైద్యాధికారి విపిన్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభతో ఉన్నత స్థానం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో మరింత ప్రావీణ్యత పొందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. వెంకటాపురంలోని కాఫెడ్ క్రీడామైదానంలో కొనసాగుతున్న నాలుగు మండలాల క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన సందర్శించారు. లీగ్ దశలో పోటీ పడుతున్న క్రీడా జట్లను పరిచయం చేసుకుని మాట్లాడారు. ఈ ప్రాంతంలోని యువకులు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం క్రీడలను మరింత ప్రోత్సహిస్తున్న క్రమంలో ఉత్తములుగా తయారుకావాలని కోరారు. ఈ టోర్నీకి తనవంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. విజేతగా నిలిచే జట్టుకు అందించే నగదు ప్రోత్సాహకాన్ని తాము ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొద్ది సేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

వెంకటాపురం, వాజేడు: వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఎమ్మెల్యే కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. వెంకటాపురం మండలంలోని పది మంది లబ్ధిదారులు, వాజేడు మండలంలోని పదిహేను మంది లబ్ధిదారులకు అందజేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ ప్రాంతంలోని అభివృద్ధి పనులను త్వరలోనే వేగిరం చేస్తామన్నారు. పాలెంవాగు మధ్యతరహా జలాశయం ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందేలా క్షేత్రస్థాయి పర్యటనను త్వరలో చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు నియంత్రించాలి

వ్యవసాయ ఆధారిత మండలంలో విద్యుత్తు సరఫరా, నియంత్రికల ఏర్పాటులో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని వాజేడు విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ అర్షద్ అహ్మద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. నియంత్రికల మరమ్మతుల పేరుతో ఆలస్యం చేయడంతో పంటలు ఎండిపోవడంతో రైతులకు నష్టం ఏర్పడుతుందన్నారు. మరమ్మతులకు ములుగు వెళ్లాల్సి వస్తోందంటూ రైతులు ఫిర్యాదు చేయడంతో ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డితో మాట్లాడి ఏటూరునాగారంలో ఎస్పీఎం ఏర్పాటు చేయాలని సూచించారు.


అటవీ భూముల్లో గుడిసెలు వేసుకోవడం సరికాదు



గుడిసెను తొలగిస్తున్న అటవీ అధికారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: అటవీ అధికారులు అక్రమంగా గిరిజనులు వేసుకున్న గుడెసెలను రెండో రోజు మంగళవారం తొలగించారు. ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గిరిజనులు రొయ్యూరు నుంచి చల్పాక వెళ్లే మార్గంలోని అటవీ భూముల్లో సుమారు 150 కుటుంబాలు గుడిసెలు వేసుకుని ఆరు నెలలుగా నివాసం ఉంటున్నాయి. సంబంధిత గుడిసెలను సోమవారం దాడి చేసి తొలగించిన అధికారులు రెండో రోజు కూడా జేసీబీ, డోజర్లు ఉపయోగించి తొలగించారు. గుడిసెలకు ఉపయోగించిన కర్రను ట్రాక్టర్‌లో కలప డిపోకు తరలించారు. ఎలాగైనా తమకు రక్షణ కల్పించాలని గిరిజనులు వేడుకున్నా.. అటవీ అధికారులు వినలేదు. అటవీ భూముల్లో గుడిసెలు వేసుకోవడం సరికాదని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అధికారులు పేర్కొన్నారు.

గురుతర బాధ్యత మీదే..!



జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్‌జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301



హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు

ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..

ఈనాడు, మహబూబాబాద్‌–న్యూస్‌టుడే, భూపాలపల్లి

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..


ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.



ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

ములుగు, న్యూస్‌టుడే: ములుగులోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. నిలువెత్తు బతుకమ్మలను రంగు రంగుల పూలతో పేర్చి అందంగా అలంకరించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళలు వేడుకలో పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరై సంబరాలను ప్రారంభించారు. సుమారు గంట పాటు ఆడిపాడి సందడి చేశారు.

ఘనంగా మొక్క ముడుపు పండగ



గద్దెల ప్రాంగణంలో రావి మొక్క నాటుతున్న పూజారులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు బుధవారం పూజారులు, యువకులు మొక్క ముడుపు పండగను ఘనంగా నిర్వహించారు. పూజారులు, యువకులు అందుబాటులో ఉన్న నర్సరీ నుంచి మొక్కలు సేకరించి గద్దెల ప్రాంగణానికి వెళ్లి అమ్మవార్లకు పూజలు నిర్వహించి రావి మొక్కను నాటారు. అక్కడ నుంచి నార్లాపురం చింతల్ క్రాస్ వద్దకు వెళ్లి తలో మొక్క నాటారు. మేడారానికి వచ్చే భక్తులు తమ వెంట మొక్కను తీసుకొచ్చి దేవతలకు ముడుపుగా చింతల్ క్రాస్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మొక్కను నాటాలని వారు కోరారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు సిద్దబోయిన మునీందర్, రాణారమేష్, లక్ష్మయ్య, కొక్కెర కృష్ణయ్య, రమేష్, అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన బోజారావు, గిరిజన మ్యూజియం సహాయ క్యూరేటర్ కుర్సం రవి, యువకులు ఆలం సుధీర్, సమ్మారావు, అట్టం రమేష్, పర్యావరణ శాస్త్రవేత్త అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ములుగు పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు ఉన్న మురుగు కాలువ ఇది. గత పది రోజులుగా వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.



బెస్తవాడలోని కాలువ ఇది. స్థానికులు వేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువ నిండా పేరుకుపోయాయి. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో కాలువ మొత్తం అధ్వానంగా తయారై మురుగు పారడం లేదు.



వీవర్స్ కాలనీలోని కాలువ దుస్థితి ఇది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా తొలగించడం లేదు.



పద్మశాలి ఫంక్షన్ హాలుకు వెళ్లేదారిలోని కాలువ నిండిపోయి మురుగు పారడం లేదు. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. రోగాలు ప్రబలే అవకాశం ఉంది.

పండగ పూట.. మురుగు కంపు!

పరిశీలన

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపైకి వ్యర్థాలు వస్తుండటంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండగ పూట మురుగు కంపు ఏంటని ప్రశ్నిస్తున్నారు. రోజురోజుకు దోమల బెడద తీవ్రమవుతుండటంతో.. జ్వరాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాల్సిన పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. కాలువల్లో మురుగు పారడం లేదు. ములుగులోని పలు కాలనీలను మంగళవారం 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

డంపింగ్ యార్డుతో సమస్యలు..

ములుగు పట్టణంలోని చెత్తను మాధవరావుపల్లి సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడే తడి, పొడి చెత్త వేరు చేయాల్సి ఉంది. ఇందు కోసం తడి చెత్తను కంపోస్టు ఎరువుగా తయారు చేసేందుకు అవసరమైన షెడ్లను కూడా నిర్మించారు. ప్రస్తుతం వీటిని వినియోగించడం లేదు. డంపింగ్ యార్డుకు తరలించిన చెత్తను రెండు, మూడు రోజులకోసారి కాల్చివేస్తుండటంతో.. సమీప అడవులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. డంపింగ్ యార్డులోని ప్లాస్టిక్ సంచులను పశువులు తినడంతో అవి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.

పట్టణంలో జనాభా 12 వేలకు పైగా ఉండగా, 13 వార్డులున్నాయి. ఈ వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. కాలువల్లో ఎక్కడి మురుగు అక్కడే నిలుస్తున్నా.. పంచాయతీ సిబ్బంది చోద్యం చూస్తోంది. దోమల నియంత్రణకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. కాలువల్లో చమురు బంతులు వేయడం, దోమల మందు పిచికారీ, ఫాగింగ్ తదితర పనులు చేపట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం

– రఘు, పంచాయతీ కార్యదర్శి, ములుగు

అన్ని కాలనీల వార్డుల్లో విడతల వారీగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. పాత కాలువలకు కొత్తగా నిర్మించిన వాటికి ఎత్తుపల్లాలు సరిపోకపోవడంతో మురుగు నిలుస్తోంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పరిష్కరిస్తామన్నారు. కొత్త డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

దోమలు ఎక్కువయ్యాయి..

– మొర్రి స్వరూప, పద్మశాలి ఫంక్షన్‌హాల్ కాలనీ



కాలనీలో మురుగు కాలువలో సమయానికి చెత్త తీయడం లేదు. పందులు కాలువల్లో సంచరిస్తుండటంతో.. దుర్వాసన వస్తోంది. దోమలు కూడా ఎక్కువయ్యాయి. పండగొస్తుంది చెత్త తీయాలని పంచాయతీ సిబ్బందికి విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదు.

రోడ్డు మీదకు వ్యర్థాలు వస్తున్నాయి..

– బైకాని ఓదెలు, కూరగాయల మార్కెటు కాలనీ




కూరగాయల మార్కెట్ వెనుక నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు మురుగు పారేందుకు కాల్వలు లేవు. రోడ్ల పైకి వ్యర్థాలు వస్తుండటంతో.. దుర్వాసన వస్తోంది. కాలనీలో ఉండలేకపోతున్నాం.

వీడియో కాల్‌ చేస్తారు.. కొల్లగొడతారు!

సైబర్‌ నేరగాళ్ల కొత్త పంథా

● కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్‌, న్యూస్‌టుడే, వరంగల్‌ క్రైం



కొత్త దారులు వెతుకుతూ..

సైబర్‌ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్‌, ఫేస్‌బుక్‌, ఇన్‌స్టాగ్రామ్‌ ద్వారా లింక్‌లు పంపించి, మల్టీలెవల్‌ మార్కెటింగ్‌, ఓటీపీ సంఖ్యలు తెలుసుకొని లేదా డెబిట్‌, క్రెడిట్‌ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువుల విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్‌ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్‌ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నారని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని. లేదంటే అరెస్టు తప్పదనేసరికి తల్లిదండ్రులు ఆందోళన చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్‌ నేరగాళ్లు మన ఫోన్‌ నెంబర్‌, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంకులు, వివిధ సంస్థలు, మాల్స్‌ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళతో కొన్ని నెంబర్లకు ఫోన్‌ చేయించి వివరాలు తెలుసుకొని కొద్దిరోజుల తర్వాత సైబర్‌ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

'హలో మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం'.. అంటూ వీడియో కాల్‌ వస్తుంది. అందులో సీబీఐ కార్యాలయం, బోర్డులు కనిపిస్తాయి. మాట్లాడేవారు ఖాకీ దుస్తుల్లో ఉంటారు.. మీ ఆధార్‌ అరెస్టు చేశామని, లేదా మీరు హవాలా మార్గంలో పెట్టుబడి పెట్టినందుకు కేసు నమోదు చేసి.. డిజిటల్‌ అరెస్టు చేస్తున్నామని మొదట బెదిరిస్తారు. ఆ తర్వాత కేసు నుంచి బయటపడాలంటే అడిగినంత ఇవ్వాలంటూ రూ.లక్షల్లో డిమాండు చేస్తారు. ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో అనేక మందికి ఇలా వీడియో కాల్స్‌ వచ్చాయి. సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలా అనేక రకాల పేర్లతో సామాన్యులకు వీడియోకాల్‌ చేసి బెదిరిస్తూ రూ.వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నారు.

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్‌, ఫోన్‌, వీడియో కాల్స్‌ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి పేర్లతో కాల్స్‌ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్‌ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

- సైబర్‌ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్‌



సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్‌, పాన్‌ కార్డు నంబర్లు చెప్పవద్దు.. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

మన దగ్గర అనేక ఘటనలు

● గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి భయపడి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.

● మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన పారిశ్రామిక వేత్తకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.

● హనుమకొండ టీచర్స్‌ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియోకాల్‌ వచ్చింది. ఆమె ఫోన్‌ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నాం, మీ అబ్బాయిని మరో నలుగురితో కలిసి అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగు తిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్‌ ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్‌ కాల్‌ అని పెట్టేశారు.

● పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైంది, ఢిల్లీలోని కార్యాలయానికి వచ్చి విచారణ ఇవ్వాలని వాట్సాప్‌ కొన్ని పత్రాలను పంపించారు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్‌ కమిషనరేట్‌లో వీడియో కాల్‌ కేసులు :	41
మొత్తం సైబర్‌ కేసులు	748
ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్‌ కేసులు	1215
మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్‌	1930



సైబర్‌ నేరాలపై వరంగల్‌ కమిషనరేట్‌ సైబర్‌ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే : ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కార్గొ పార్శిల్‌, కొరియర్‌ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్‌ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్‌ వద్ద టీటీఐ అధికారులు తనిఖీ చేసారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్‌ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా కార్గొ ద్వారా బుకింగ్‌ అయి వస్తున్నాయని చెప్పారు. వాటికి సంబంధించిన రశీదు లేకపోవడంతో మూటలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారికి విధులు అప్పగించకుండా విచారణ జరిపించాల్సిన డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకులు రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెపుతున్నారు. కార్గొ బుకింగ్‌ చేయని ఎలాంటి వస్తువులు, పార్శిల్‌ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్‌-1 డిపో మేనేజర్‌ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లకు ఛార్జిషీట్‌ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్‌ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్‌

వరంగల్‌ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్‌ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్‌ అథ్లెటిక్స్‌ ఛాంపియన్‌షిప్‌-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్‌-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్‌ చీఫ్‌ కోచ్‌, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్‌, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్‌ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్‌ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్‌ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా(ఏఎఫ్‌ఐ) టైమింగ్‌ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్‌, ఆర్యవైశ్య ఫెడరేషన్‌ జాతీయ అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్‌-20 విభాగంలో ఎండీ.కైఫ్‌ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్‌ జావెలిన్‌ త్రోలో రజతం, అండర్‌-18 విభాగంలో దత్తు లాంగ్‌ జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్‌ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్‌ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్‌, రాష్ట్ర అథ్లెటిక్స్‌ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్‌ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్‌ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్‌ అథ్లెటిక్స్‌, 2026లో ఏషియన్‌ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్‌ రికార్డు నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్‌ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్‌ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్‌ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్‌ పోటీలకు సన్వి



వరంగల్‌ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్‌ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్‌ స్కేటింగ్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీలు జరిగాయి. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్‌-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్‌ స్కేటింగ్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ అజీజ్‌ఖాన్‌, కార్యదర్శి కైలాస్‌యాదవ్‌ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్‌ కిషోర్‌ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్‌ పోలీసు కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్‌ కమిషనరేట్‌, మహబూబాబాద్‌ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్‌ కమిషనర్‌ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్‌ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్‌ కిషోర్‌ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్‌ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్‌, సురేష్‌కుమార్‌, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్‌ఆర్వో శంకర్‌, సిబ్బంది

ములుగు టౌన్‌, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో శంకర్‌ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్‌ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్‌ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో పేర్కొన్నారు.

చికెన్‌ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్‌	
ఫాం:	114
రిటైల్‌:	136
డ్రెస్డ్‌:	197
స్కిన్‌లెస్‌:	224

ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ములుగు పట్టణం సాధన స్కూల్ సమీపంలో నిర్వహించే రావణాసురవధ ఉత్సవ కరపత్రాలు, గోడ పత్రికలను డీఎస్పీ రవీందర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయినటువంటి రావణాసురవధ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నందుకు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమ నిర్వహణకు అగ్నిమాపక, విద్యుత్తు, అంబులెన్స్ తదితర అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు గంద్రకోట కుమార్, ప్రధాన కార్యదర్శి గందె రాజు, కోశాధికారి జనార్దన్, సభ్యులు భూక్య జంపన్న, పాడ్య కుమార్, ఇమ్మడి ఓదెలు, నాగరాజు, రాజేందర్, పాడ్య చంటి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు

'అల్లుకున్న' నిర్లక్ష్యం..!

ములుగు మండలం అబ్బాపురం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న విద్యుత్తు స్తంభాలకు మొక్కల తీగలు అల్లుకున్నాయి. గత నెలలో కురిసిన వర్షాల సమయంలో ఎర్తింగ్ సమస్యతో పాటు తరచూ కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇటీవల వస్తున్న ఈదురు గాలులకు నిత్యం విద్యుత్తు సమస్య వస్తుందని, వీధి దీపాన్ని సైతం మొక్కల తీగలు చుట్టుముట్టడంతో రాత్రి పూట సరిగా వెలుతురు ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, ములుగు రూరల్



మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

పైప్‌లైన్‌కు మరమ్మతు

స్పందనకు వందనం

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం పస్రా పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్ తండాలో పైప్ లైన్ లీకేజీ అవుతుండడంతో తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తగా గ్రామస్థులు సమస్యను 'మేమున్నాం. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యను 'న్యూస్‌టుడే' ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి శ్వేతకు వివరించగా, ఆమె స్పందించి పంచాయతీ సిబ్బందిని పంపించి పైప్ లైన్‌కు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు.



ధాన్యం ఆరబెట్టుకోవడానికి స్థలం కేటాయించాలి

మంగపేట, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి స్థలం ఏర్పాటు చేయాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను ఆరబెట్టుకోవడానికి గ్రామాల్లో స్థలం లేక పంట పొలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా కలెక్టర్, మంత్రి స్పందించి స్థలాలు లేని గ్రామాల రైతులకు ఎకరం నుంచి రెండెకరాల వరకు భూమిని కేటాయించాలని కోరారు.

అతివలకు భరోసా 'ఆరోగ్య మహిళ'

వెంకటాపురం, న్యూస్‌టుడే: మహిళల్లో రుగ్మతలను ఆదిలోనే నియంత్రించేందుకు అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి స్నేహ అన్నారు. వెంకటాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో శిబిరంలో పలువురు మహిళలకు సేవలందించారు. రక్తనమూనాలు సేకరించారు. గ్రామీణులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ములుగులోని రామాలయం ప్రాంగణంలో..


వాజేడు మండలం ధర్మారం గ్రామంలో..


గోవిందరావుపేటలోని గోవిందరాజస్వామి దేవాలయంలో హోమ క్రతువు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


ఏటూరునాగారం సీతారామచంద్రస్వామి ఆలయంలో


వెంకటాపురం రజకవీధిలో..


మంగపేట మండల కేంద్రంలో..

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత మహాలక్ష్మీదేవి, శ్రీలలితాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా మండపాల నిర్వాహకులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల సామూహిక కుంకుమార్చన, హోమ క్రతువు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలు సమర్పించి వేడుకున్నారు.

- న్యూస్‌టుడే, యంత్రాంగం


పస్రాలో శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

చేప పిల్లల పంపిణీ



ములుగు, న్యూస్‌టుడే: వందశాతం రాయితీపై చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ములుగులోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎంపీడీవో రహీం చేతుల మీదుగా చేప పిల్లలను పంపిణీ చేశారు. సుమారు రూ.8 లక్షల విలువైన పిల్లలను జిల్లాలోని 11 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చెందిన 87 చెరువులకు పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాదరఘు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

వాజేడు, న్యూస్‌టుడే: మావోయిస్టులకు, అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించొద్దని పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ గ్రామస్థులకు సూచించారు. పేరూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. మావోయిస్టులకు సహకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సూచనలిస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

మూగజీవాల ఆకలి తీర్చుతున్న డ్రైవర్ సమ్మయ్య

మంగపేట, న్యూస్‌టుడే: మూగజీవాల ఆకలి చూసి చలించాడు.. బస్సు నడుపుతున్న క్రమంలో రోడ్డుపక్కన బిక్క ముఖం వేసుకొని ఎవరైనా ఏదైనా తినేందుకు వేస్తారేమోనని చూస్తున్న వానరాలను చూసి వాటి ఆకలి తీర్చాలనుకున్నాడు ఆర్టీసీ బస్సు డ్రైవర్ కొండపర్తి సమ్మయ్య. ఈయన హనుమకొండ నుంచి మంగపేటకు పల్లెవెలుగు సర్వీసు నడుపుతున్నాడు. వినూత్నంగా ఆలోచించి వారంలో ఒకరోజు హనుమకొండలోని పండ్ల దుకాణాల వద్ద పలు రకాల పండ్లు సేకరించి బస్సులో తీసుకొచ్చి అడవిలో ఉన్న కోతులకు వేసి వాటి ఆకలిని తీర్చుతున్నాడు. మంగళవారం సమ్మయ్య కమలాపురం సమీప అడవిలో కోతులకు యాపిల్, దానిమ్మ పండ్లు సుమారు 30 కిలోలు సేకరించి వేస్తున్న చిత్రాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. మూగ జీవాలు అంటే తనకు ప్రాణమని, డ్యూటీకి వచ్చే క్రమంలో వారంలో ఒక రోజు పండ్లు తీసుకొచ్చి వేస్తానని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.




వాజేడు మండలం ప్రగళ్లపల్లిలో


గోవిందరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట

శ్రీలక్ష్మీ నీ మహిమలూ.. చిత్రమై తోచునమ్మా

తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో అందంగా బతుకమ్మను పేర్చారు. మహిళా ఉద్యోగులు వేడుకల్లో పాల్గొని ఆట పాటలతో అలరించారు.

- న్యూస్‌టుడే, యంత్రాంగం


తాడ్వాయిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో..


ములుగు ఎస్పీ కార్యాలయంలో మహిళా కానిస్టేబుళ్లు

ప్రసవ సేవల్లో నిర్లక్ష్యం.. మహిళకు ప్రాణాపాయం

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన


వరంగల్‌లోని సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో బాధితురాలు, వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వెంకటాపురం, న్యూస్‌టుడే: నిపుణుల కొరత.. ప్రసవ సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం ఓ గిరిజన మహిళకు ప్రాణాపాయంగా మారింది. వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకున్న ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు, బాధితురాలి బంధువులు భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, ఆసుపత్రి వైద్యుల దృష్టికి తీసుకెళ్లడంతో విషయం బహిర్గతమైంది. వివరాలు ఇలా.. మండలంలోని చినగంగారానికి చెందిన చింత భువనేశ్వరి రెండో కాన్పు కోసం గత నెల 24 తేదీన స్థానిక సీహెచ్‌సీలో చేరారు. ప్రసవం చేసిన సమయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగిన అనంతరం మూత్రాశయ సమస్య తలెత్తడంతో హుటాహుటిని ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. అదే రోజు అక్కడి నుంచి ములుగు జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి వెంటనే వరంగల్ ఎంజీఎంకు పంపినట్లు పేర్కొన్నారు. అక్కడి వైద్యులు మెరుగైన సేవల కోసం వరంగల్‌లోని సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో చేర్చారు. గర్భ సంచి దెబ్బతిన్నట్లు నిర్ధారించిన వైద్యులు శస్త్రచికిత్స చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఆ ఆసుపత్రిలోనే సేవలు పొందుతున్నారు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన మహిళ ప్రాణాపాయానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు పూనెం రామచందర్‌రావు, చింత సోమరాజు, పర్శిక సతీశ్‌లు డిమాండ్ చేశారు.

● గిరిజన మహిళ ప్రాణాపాయ స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. చరవాణిలో డీఎంహెచ్‌వో అప్పయ్యతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాలతో డీఎంహెచ్‌వో సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో సేవలు పొందుతున్న బాధితురాలిని పరిశీలించారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ప్రసవ సమయంలో బిడ్డ బరువుగా ఉండటంతోనే మూత్రాశయ సమస్య తలెత్తినట్లు చెప్పారు. ఈ మేరకు మెరుగైన సేవలు అందించగా, ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు.

సరికొత్తగా.. పారిశ్రామిక శిక్షణ!

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ప్రస్తుత ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ఇప్పటికే సివిల్ పనులు మొదలయ్యాయి. వారం క్రితమే భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో పనులు ప్రారంభించారు. వచ్చే నవంబరు వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐ కళాశాలల గురించి పట్టించుకోకపోవడంతో కొత్త కోర్సులు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ల అప్‌గ్రేడ్లను గాలికొదిలేశారు. అరకొర వసతులతో ఐటీఐలు నిర్వీర్యమై విద్యార్థులు కూడా నైపుణ్యాభివృద్ధికి దూరమయ్యారు. కనీస మరమ్మతుల్లేక శిథిల భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసి, నిరుద్యోగ యువతకు నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. ఐటీఐ కళాశాల ఆవరణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లను నిర్మిస్తుండగా, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పనులు ఇప్పటికే ప్రారంభించారు. భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఏటీసీ నిర్మాణ పనులకు దాదాపు రూ.4.50 కోట్ల నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఆరు కొత్త ట్రేడ్‌లలో ప్రవేశాలు

యువతలో నైపుణ్యాలు అభివృద్ధి చేసి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు ఏటీసీలలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే కోర్సులు మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, రెండు సంవత్సరాల కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ మెకానికల్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషనింగ్ టెక్నిషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ అనే ట్రేడ్ ఏర్పాటు చేయనున్నారు. ఒక ఏడాది కాలపరిమిత గల ట్రేడ్‌లలో 24 చొప్పున సీట్లు, రెండేళ్ల కాలపరిమిత గల ట్రేడ్‌లలో 40 సీట్ల చొప్పున అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే ఐటీఐ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. కొత్త కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు.


భూపాలపల్లి ఐటీఐ కళాశాల ఆవరణలో మొదలైన ఏటీసీ నిర్మాణ పనులు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు 8 వరకు ఉన్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో రెండు చొప్పున, హనుమకొండ జిల్లాలో 3, మహబూబాబాద్ జిల్లాలో ఒకటి.. మొత్తం 8 ప్రభుత్వ ఐటీఐ కళాశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 ఐటీఐ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ నిర్మాణ పనులకు అనుమతిచ్చింది. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2024-25 సంవత్సరంలో ప్రభుత్వం కేవలం భూపాలపల్లి, ఏటూరునాగారం ప్రభుత్వ ఐటీఐలలో మాత్రమే ఆరు కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతిచ్చింది.

యువతకు ఎంతో ప్రయోజనకరం

- జామ్లానాయక్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, భూపాలపల్లి



ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏటీసీలతో నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఇటీవల భవన నిర్మాణ పనులు ప్రారంభించాం. ఆరు కొత్త ట్రేడ్‌లపై సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అడ్మిషన్ల ప్రక్రియ చేపడతాం.

పౌర హక్కుల శ్రామికుడు బాలగోపాల్


పూలమాల వేస్తున్న ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, శ్రేణులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: పౌర హక్కుల సాధనకు నిరంతరం పాటుపడిన శ్రామికుడు బాలగోపాల్ అని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి అన్నారు. పౌర హక్కుల నేత బాలగోపాల్ 15వ సంస్మరణ కార్యక్రమాన్ని వెంకటాపురంలోని పీఏసీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల పక్షాన పోరాటాలు చేసి ఆత్మబంధువుగా నిలిచారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎట్టి బాబూరావు, చింత సర్వేశ్వరరావు, నాయకులు కుచ్చింటి చిరంజీవి, మొడెం నాగరాజు, చేలే రాజేశ్, కామేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి


ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి

వెంకటాపురం, న్యూస్‌టుడే: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అమరజీవి గుర్రం వెంకటేశ్వర్లు ఎనలేని కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురంలో మంగళవారం గుర్రం వెంకటేశ్వర్లు 14వ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని ప్రయాణికుల ప్రాంగణం సమీపంలోని ఆయన స్తూపానికి జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, గుర్రం పుల్లారావులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ ప్రాంతంలోని గిరిజనులు, పేదల సంక్షేమానికి నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త శ్రమించాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను, నాయకులు దావూద్, వాసు, నర్సింహాచారి, ఆదినారాయణ, రాములు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, మాణిక్యం, ప్రసాద్, బాబూరావు, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

నేర సమాచారం

పాము కాటుతో రైతు మృతి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: పాము కాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన ములుగు మండలం అబ్బాపురం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాపురం గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య(55) మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా అతడి కాలుపై పాము కాటు వేసింది. కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు ఆయన వద్దకు చేరుకునేలోగా అస్వస్థతకు గురయ్యారు. నోటి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు పంచాయతీ ట్రాక్టర్‌లో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులున్నారు.


సాంబయ్య (పాతచిత్రం)

జ్వరంతో యువకుడి..

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం చిన్నగుంటూరుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానందుల బాలరాజు-సునిత దంపతుల కుమారుడు కృష్ణసాయి(25) గత పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ములుగు ఏరియా ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించినా.. తగ్గకపోవడంతో వైద్యుల సలహా మేరకు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ కూడా నయం కాకపోవడంతో.. సోమవారం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.


బాలరాజు (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలోని అమ్మ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం రెండు వాహనాలు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన ఆకుదారి లక్ష్మణ్(37) తన ద్విచక్రవాహనంపై ఏటూరునాగారానికి వస్తున్నాడు. ఏటూరునాగారం బస్టాండు నుంచి ప్రయాణికులతో వెళ్తున్న టాటామ్యాజిక్ వాహనం అమ్మ ఆసుపత్రి వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో.. ములుగులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

'అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు'


సమావేశమైన ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ విద్యావిభాగంలో పనిచేసే ఉన్నతాధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొర్నిబెల్లి గణేష్ ఆరోపించారు. తాడ్వాయిలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల వార్డెన్ల నుంచి 25 శాతం కమీషన్లు తీసుకొంటూ విద్యార్థుల కడుపుకొడుతున్నారని విమర్శించారు. సీఆర్టీలకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించాలని ఆయన కోరారు.

కష్టకాలంలో అండగా ఉంటాం..


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగజ్యోతి

తాడ్వాయి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కష్టకాలంలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. తాడ్వాయి మండలంలోని బీరెల్లికి చెందిన మంతెన సందీప్ ఉపాధి కోసం హైదరాబాదుకు వెళ్లి ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకొన్నాడు. దీనస్థితిలో ఉన్న ఈ కుటుంబాన్ని బుధవారం నాగజ్యోతి పరామర్శించి రూ.10వేలు నగదు, బియ్యం నిత్యావసరాలు అందజేశారు. నాయకులు చంద్రం, బందెల తిరుపతి, రోశయ్య, రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.